క్లుప్తంగా

ముత్యాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



ముత్యాలమ్మకు వెండి కిరీటాన్ని బహుకరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేసుపురం గ్రామ దేవత ముత్యాలమ్మకు కుసుంపురం పంచాయతీ కార్యదర్శి కొప్పల రవికుమార్ దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మేళ తాళాల నడుమ అమ్మవారికి కిరీటాన్ని ఆలయ పూజారి ధరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో కాళీమాత ఉత్సవం



కాళీమాతను ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: కేసుపురం గ్రామంలోని కొప్పల వీధిలో ఆదివారం ఘనంగా కాళీమాత ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారీ చేసిన గజముద్దను, కాళీమాత వేషధారణతో బాణసంచా నడుమ ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

పలాస: సవర రామక్రిష్ణాపురం గ్రామంలో సోమవారం అన్నపూర్ణదేవి సహిత కాశీవిశ్వేశ్వర స్వామి కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్టు కేదారిపురం పంచాయతీ కార్యదర్శి ఫాల్గుణరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హర్షబడ పంచాయతీ సవర రామక్రిష్ణాపురం గ్రామంలో స్వామి వారి కల్యాణంతో పాటు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

కంచిలి: క్రీడలతో వివిధ ప్రాంతాల మధ్య ఉన్న క్రీడాకరుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని తలతంపర సర్పంచ్ జగబంధు దొలాయి అన్నారు. తలతంపర గ్రామంలో గడచిన 38 రోజులుగా నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కవిటి–ఆర్. బెలగాం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో ఆర్.బెలగాం జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 15 వేలు నగదు బహుమతిని, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ. 10 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. పోటీలకు అర్గనైజర్‌గా పురేంద్ర దొలై వ్యవహరించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పాత జాతీయ రహదారి రైల్వే గేట్ వద్ద ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం ఊరేగింపు నిర్వహించగా ఆదివారం ఆలయంలో దర్శణ భాగ్యం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ దాతకు సత్కారం



సత్కారం పొందుతున్న భాస్కరరావు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పాత జాతీయ రహదారి రైల్వే గేట్ దగ్గర ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ నిర్మాణ దాత పెంట భాస్కరరావును కంచి కామాక్షి స్వర్ణకారుల సేవా సంఘం సభ్యులు ఆదివారం సత్కరించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్న ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. సంఘం అధ్యక్షులు అండలూరి కోటేశ్వరరావుతో పాటు కార్యవర్గ సభ్యులు, ఆలయ నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ఆత్మీయ సమ్మేళనం



మండల కేంద్రం కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్వ విద్యార్థులంతా ఒక చోటకు చేరి కబుర్లు చెప్పకొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఏస్థితిలో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఆత్మీయ కలయికలు అనేవి జీవితంలో ఒక మధుర స్మృతులుగా నిలిచిపోతాయని అన్నారు. వీరితోపాటు అప్పటి గురువులు కూడా పాల్గొన్నారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. -కంచిలి

• యువత శ్రమదానం



సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన వివేకనందా యువజన సంఘ సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. మంచినీటి బావిలో పేరుకుపోయిన బురదను బయటకు తీశారు. వేసవి నేపథ్యంలో బావిలో నీరు అడుగంటిపోయింది. దీంతో గ్రామస్తులు నీటి కొరత ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువత ముందుకు వచ్చి బావిని శుభ్రం చేశారు. శ్రమదానం చేపట్టి బావిని శుభ్రం చేసిన యువతను గ్రామసర్పంచ్ తామాడ పద్మావతి, గ్రామస్తులు అభినందించారు. -సోంపేట

• రక్తదాన శిబిరం



సినీ నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని టెక్కలిలో టీమ్ తారక్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాలిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో 41 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆస్పత్రి వైద్యురాలు సునీత ఆధ్వర్యంలో రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వెంకీ, కిరణ్, పవన్, లక్ష్మణ్, బాలకృష్ణ, డిల్లీ పాల్గొన్నారు. -టెక్కలి

ఆదర్శనీయులు సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు రూరల్: సుందరయ్యకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి: నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నేటితరం రాజకీయ నాయకులకు ఎంతో ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ప్రతిఒక్కరూ సుందరయ్య అడుగుజాడల్లో నడవాలని కోరారు. టెక్కలిలో సుందరయ్య వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థ ప్రజా సేవకునిగా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. నేటి తరం నాయకులంతా ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో ఎన్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, హెచ్.ఈశ్వర్రావు, పి.సాంబమూర్తి, యు.లక్ష్మణరావు, డి.లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, ఉదయ్, గౌరమ్మ, దుర్గాప్రసాద్ ఉన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నేటి తరానికి అదర్శనీయమని సీపీఎం నాయకులు బమ్మిడి అనందరావు అన్నారు. నగరంపల్లిలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని రైతులకు అందించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. విద్యార్థి దశలోనే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తు చేశారు. త్యాగజీవి, విలువలు కలిగిన పుచ్చలపల్లి సుందరయ్య అశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు. ప్రజా సంఘాల నాయలకులు నెయ్యిల మోహన్‌రావు, ఎన్.చంద్రయ్య, మనోజ్, బి.సుగుణ, టి.భాస్కరరావు,ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, బి.రామక్రిష్ణ ఉన్నారు.

ఘనంగా యూవీవీ వార్షికోత్సవం



అవార్డులతో విద్యార్థులు, యూవీవీ ప్రతినిధులు

పలాస: మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యూవీవీ అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యులు టి.బాలక్రిష్ణ, తెప్పల ఆనంద్, మట్ట ఖగేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ యూవీవీ సేవలను కొనియాడారు. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం చేస్తున్న సేవలు అమూల్యమన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి చెందిన ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బద్రి కూర్మారావు, దుమ్ము శంకరరావు, సాహుకారి వల్లభరావు, లండ జగన్నాథం, పెద్దింటి శిశిధరవర్మలకు ఘనంగా సన్మానం చేశారు. ఉద్దానం ప్రాంతంలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుత్తుం ప్రకాశరావు, అధ్యక్షులుగా బొమ్మాళి శివ, ఉపాధ్యక్షులుగా పోతనపల్లి గీతమ్మ, ప్రధాన కార్యదర్శిగా గౌరకల లోకేశ్వరరావు, కార్యదర్శిగా ఎంపల్లి కామేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా జినగ సీతారాంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూవీవీ ప్రతినిధులు బొడ్డు చిన్నారావు, బి.ఓంకార్, టి.వాసుదేవరావు, కుత్తుం వినోద్, పోతనపల్లి బాలరాజు, తామాడ రామారావు పాల్గొన్నారు.

నిధుల జమ గొప్ప విషయం



సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

● వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్

కవిటి: పేదలపక్షపాతిగా, సంక్షేమానికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. కవిటిలో స్థానిక నేతలతో కలిసి ఆదివారం మాట్లాడారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని గౌరవిస్తూనే పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాల లబ్ధిని ఇచ్చిన మాట ప్రకారం చెల్లించారన్నారు. మహిళలకు చేయూత, విద్యార్థులకు విద్యాదీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను వారి ఖాతాలలో తాజాగా జమ చేయడం గొప్ప విషయం అన్నారు. 2019లో తిత్లీ తుఫాన్ పరిహారాన్ని ఎన్నికల కోడ్ ఉన్నా ఎటువంటి అడ్డు పెట్టకుండా రైతులకు చెల్లించడంలో వైఎస్సార్‌సీపీ పూర్తిసహకారం అందించినట్టు గుర్తు చేశారు. అయితే తాజాగా 2024 ఎన్నికల కోడ్ బూచీ చూపించిన ప్రతిపక్ష టీడీపీ అండ్ కో పార్టీలు మాత్రం ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు ఇచ్చి పేదల లబ్ధిని అందించే సంక్షేమ పథకాల్ని అడ్డుకొని చరిత్రహీనులుగా.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను దిగజార్చారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో పేదలకు జరిగే మేలును కూడా స్వప్రయోజనాల కోసం అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.నీలాచలం, పాండవ శేఖర్, బెందాళ రమణమూర్తి, ఎం.కృష్ణారావు, దేవాడ దుర్యోధన ఉన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు

కాశీబుగ్గ: జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. క్రాప్ ఇన్సూరెన్స్ అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. మందస మండలం హరిపురంలో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పెట్టుబడులు అధికంగా ఉన్నందున 80 కిలోల జీడి బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే మేలైన వరి వంగడాలు, పచ్చి రొట్ట ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని, పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, పుచ్చ దుర్యోధన, మామిడి మాధవరావు, హడ్డి మాస్టారు, బెస్త కామేశ్వరరావు, కొమరావాసు, సోమనాథము, చలపతి, ముకుందరావు, లోకనాథం పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న భక్తులు

కాశీబుగ్గ: పలాస వైశ్యసంఘం భవనం వద్ద ఉన్నటువంటి వాసవి కన్యకాపరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినం సందర్భంగా చేపట్టిన పూజా కార్యక్రమాలలో వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, పలు రకాల పండ్లు నైవేద్యంగా భక్తులు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

టెక్కలి రూరల్: స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన వృద్ధురాలు దలై రామరత్నం (68) విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. గత నెల 22వ తేదీన రామరత్నం ఇంట్లో దేవుడికి దీపం పెడుతుండగా చీరకు తగలడంతో మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో అమెను తొలుత చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పారు. మృతిరాలి భర్త మల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టెక్కలి ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

స్వర్ణవర్ణ మేఘమాల..



ప్రకృతి రమణీయత దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: సాయం సంధ్య వేళ..స్వర్ణ వర్ణ మేఘమాల అబ్బురపరిచింది. నువ్వలరేవు ఉప్పుటేరు వద్ద ఆదివారం ప్రకృతి రమణీయ దృశ్యం చూపరులకు కనువిందు చేసింది. పైన వర్ణ రంగు మేఘాలు..క్రింద పాల పుంత కమ్మేసినట్టు అందంగా కనిపిస్తున్న ఉప్పుటేరు అందాలు అలరించాయి.

రేపటి నుంచి హ్యాపీనెస్ కార్యక్రమం

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు హ్యాపీనెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీచర్ సంబాళ్ల కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదర్శన క్రియ ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రియ ద్వారా మనలో ఒత్తిడి, టెన్షన్, మైగ్రేన్, నిద్రలేమి తొలిగి ఎలాంటి సమస్యను అయినా ఎదుర్కొనే శక్తి వస్తుందని అన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కోర్సులో చేరాలనుకునేవారు 95056 77388 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ర్యాలీలో సీహెచ్‌సీ సిబ్బంది, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ స్మారక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధితో మృతిచెందిన వారికి సంతాపంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వైసీబీ ప్రివిన్సెన్ ట్రక్కర్ యూనియన్ స్వచ్ఛంద సంస్థ, సీహెచ్‌సీ వైద్యసిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక సీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ బమ్మిడి రాజశేఖర్, స్వచ్ఛందసేవాసంస్థ సిబ్బంది వై.రవికుమార్, గున్న రవికుమార్, సీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

కేఆర్‌పేటలో గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభం



కోలాట ప్రదర్శనకు సిద్ధమైన చిన్నారులు



జనంతో సందడిగా ఉన్న కేఆర్‌పేట వీధులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబాలరాయుడుపేటలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పాండురంగ సోదర సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, సర్పంచ్ వంక చిరంజీవి, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు వంక శివశంకర్ తెలిపారు. అమ్మవారికి చల్లదనం చేయడంతో పాటు గ్రామస్తులు, సేవా సంఘం ప్రతినిధుల సహకారంతో పాండురంగ స్వామి, రుక్మిణాంబల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. పొరానికి ఘట్టాలతో గ్రామంలో సందడిగా నెలకొంది.

పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు



మెండపేటలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలస, మెండపేట గ్రామాల్లో 114 పశువులకు జబ్బవాపు నివారణకు ఉచిత టీకాలను ఆదివారం వేసినట్టు కురుడు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌మార్ తెలిపారు. పశువుకు 104 డిగ్రీలకు మించి జ్వరం రావడం, మేతమేయక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే జబ్బవాపు వ్యాధి ఉన్నట్టు గుర్తించాలన్నారు. మూడు నుంచి ఏడు నెలల దూడలకు ఎక్కువగా జబ్బవాపు వ్యాధి సోకుతోందని.. పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని కిరణ్‌కుమార్ సూచించారు. షెడ్యూల్ మేరకు మండలంలోని 38 పంచాయతీల్లోనూ పశువులకు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



ప్రగడపుట్టుగలో కల్యాణోత్సవఘట్టం

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలో వెలసిన కోదండరామాలయం, కవిటిలో వెలసిన పట్టాభి రామ ఆలయాల్లో ఆదివారం వైశాఖమాస కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కోదండ రామాలయ అర్థశతాబ్ది వైశాఖ మాసోత్సవాలు, పట్టాభిరామాలయం 78వ తిరుక్కల్యాణోత్సవాలు పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో బ్రహ్మపురానికి చెందిన ఆగమశాస్త్ర పండితుల పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాఃవచనం, నిత్యారాధనలు జరిగాయి. లోకకల్యాణార్థం శాంతిహోమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రగడపుట్టుగలో సీతారాములు కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అపూర్వ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలే దీనికి వేదికైంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని ఆనందపడ్డారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సత్కరించి పాదాభివందనాలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం విందుభోజనాలు, ప్రసంగాలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని తుమ్మావీధిలో వెలసి లక్ష్మీనసింహస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు టి.చంద్రశేఖరరావు, ఈవో మాధవిల ఆధ్వర్యంలో స్వామి ప్రాతఃకాల పూజలు, అష్టోత్తర శత నామాలతో అర్చనలు భక్తుల గోత్రనామాలతో చేశారు. సాయంత్రం అర్చకులు పెంట శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో లక్ష్మీదేవి, గోదాదేవి సమేత నరసింహస్వామి ఉత్సమూర్తులను మండపంపై ఉంచి సంప్రదాయంగా పూజలు నిర్వహించి, కల్యాణ వేడుకలు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.